# వశిష్టమహర్షి

వసిష్ఠమహర్షి నవబ్రహ్మలలో విశిష్ఠకీర్తినార్జించెను. సప్త మహర్షులలో ఉత్తముడు. ఇక్ష్వాకువంశ క్షత్రియులకు కులగురువు. బహు వంశపరంపరలు వృద్ధిగాంచనెంచి బ్రహ్మ వశిష్టమహర్షిని వివాహమాడ ప్రోత్సహించెను. లోకమున ఉత్తమ వంశములు క్షీణించి, ధర్మము నశించి, దయాప్రేమ, సహనములు మచ్చుకైననూ చిక్కక దానవమయము కాగలదని, బ్రహ్మ సంకల్పించి, ఉత్తమ మహర్షులలో ఉత్తమ వంశములు ప్రారంభించుటకు వీలుగ వసిష్ఠులవారిని ప్రేరేపించ బ్రహ్మ ఆజ్ఞకు బద్ధుడై అరుంధతిని వివాహమాడెను. అరుంధతీ సహితుడై ఆశ్రమమున ప్రవేశించి, నిత్యోజ్జ్వలులై, ఆత్మతత్త్వానవద్యులై నిర్విచార నిరామయ జీవితమును గడుపజొచ్చిరి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు వసిష్ఠులయందు మచ్చుకైననూ కానరావు. వారి నీమనిష్టలయందు ఎట్టి ప్రతికూలములు సంభవించిననూ వాటిని లెక్కచేయక నీమనిష్టలను పాటించెడివారు. ఒకనాడు విశ్వామిత్రుడు వసిష్ఠులవారి ఆశ్రమమునకు విజయము చేయుటచేత, అతనికి అతని పరివారమునకు విందు చేసెను. ఇట్టి విచిత్ర విందునకు విశ్వామిత్రుడు ఆశ్చర్యమొంది, ఎట్టి పనివారలుగానీ, పదార్థములుగానీ లేని ఈ అరణ్యమున ఇట్టి గొప్ప విందు యెటుల చేసెనని విచారించగా అతని చెంత కామధేనువనబడు నందినీ ధేనువు కలదని తెలుసుకొని విశ్వామిత్రుడు ఆ ధేనువును తనకొసంగమని అడుగుట, వసిష్ఠులవారు అందులకు అంగీకరించకపోవుట, కడకు విశ్వామిత్రుడు తన బలమును వినియోగించి ధేనువును గొనిపోవ ప్రయత్నించుట, కడకు విచిత్ర యుద్ధమే జరిపి విఫలుడై విశ్వామిత్రుడు ఆనాటినుండియు వసిష్ఠులవారిపై ద్వేషము పూనుట సంభవించెను. విశ్వామిత్ర ప్రేరితుడగు రాక్షసునిచే వసిష్ఠులవారి పుత్రులు మరణించుటచే, ఆ శోకమును భరించలేక వసిష్ఠులవారు కొంత దేహభ్రాంతి కలిగియుండుటచేత, ప్రాణత్యాగమునకు పూనుకొని కడకు యిది భ్రాంతియని తనకు తాను తెలుసుకొని అట్టి సాహసమునుండి వెనుకకు తిరిగెను. కొంత కాలమునకు దైవమే వారలకు కుమారునిగా పుట్టబోవుచున్నారని గమనించి, దశరథుని రాజ్యమును చేరి అక్కడ రాజపురోహితునిగా నిలచి దశరథునితో పుత్రకామేష్టి యాగము చేయించి రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులను తగిన రీతుల సేవించి రఘువంశమును వృద్ధిగావింపజేసి, రాజులకు నీతులను బోధించి, దైవమునుగాంచి ధన్యుడైన పవిత్రుడు వసిష్ఠుడు.

వసిష్ఠమహర్షి అనేక మహారాజులకు కర్మ స్వరూపమును, బ్రహ్మస్వరూపము, వేదాంత, పురాణ స్వరూపమును భగవదవతార రహస్యమును తెలిపెను. అంతేకాదు, వసిష్ఠుడు స్మృతి కర్త. అతను ముప్పది అధ్యాయములుగ స్మృతిని వ్రాసెను. దానినే వసిష్ఠ ధర్మసూత్రమందురు.

వసిష్ఠ మహర్షి మహనీయుడు. సర్వవిద్యలు అతని హస్తగతము. దైవఋషి. అతడికి శ్రీరాముడు శ్రీమన్నారాయణుడని తెలుసు. ఒకానొక సమయంలో దశరథునకు చెబుతున్నాడు వసిష్ఠుడు, 'దశరథా! ధనధాన్యాదులు నేనేమీ నీనుండి కోరటం లేదు. నీ దగ్గర పురోహితునిగా వచ్చి వుండటానికి నాకేమీ అవసరం లేదు. కానీ, నీ గృహములో సాక్షాత్ నారాయణమూర్తి ఉద్భవిస్తున్నాడు. కనుక, అతని చర్యలు చూడాలి. అతని సేవలు చెయ్యాలి. ఆ ఉద్దేశ్యముతోనే నేను నీ దగ్గర పురోహితునిగా పనిచేస్తున్నాను. నీ ధన కనక వస్తు వాహనాదులు నాకు అక్కరలేదు. నేను సంకల్పించుకుంటే సర్వమూ ఏర్పడుతుంది. దైవము కోసము నేను నీ ఇల్లుచేరాను' అన్నాడు.

దశరథుడు తన బిడ్డలకు జనన కర్మల నాచరిస్తూ రెండవ దినము స్వస్తివాచకములు పలికే నిమిత్తమై గురువైన వసిష్ఠులవారివద్దకు ఆ బిడ్డలను తీసుకువెళ్ళాడు. ఆశీర్వదించమని కోరాడు. వసిష్ఠుడు వారిని చూచి, 'దశరథా! నన్ను నేనే మరచిన ఈ స్థితిలో స్వస్తివాచకములు ఏరీతిగా నాకు జ్ఞపకము వస్తాయి? ఏ నిమిత్తమై నీ దగ్గర చేరితినో, ఆ పరిపూర్ణమైన ఫలితము నేను ఈనాడు అనుభవించాను' అన్నాడు. వసిష్ఠులవారు సర్వజ్ఞులు, సర్వశక్తిమయులు అయినప్పటికినీ దశరథుని కొలువులో కేవలం పురోహితునిగా జీవించటంలోగల అంతరార్థమేమిటి? 'దశరథా! నీ ధనము నాక్కరలేదు. నీ గౌరవమర్యాదలు నాకక్కరలేదు. నీ గృహములో శ్రీమన్నారాయణమూర్తి జన్మించబోతున్నాడు. అతనిని దర్శించే నిమిత్తమే నేను నీ వద్ద పురోహితునిగా చేరాను. నేను ఇప్పుడు ఆ స్వరూపము దర్శించాను. నా చిరకాల వాంఛ నెరవేరింది. నేను ధన్యుడనైనాను. ఇంక ఇతనికి నేను స్వస్తివాచకం ఏరీతిగా

చెప్పాలి? నేను అంత జ్ఞానిని కాను, పరమాత్మకు స్వస్తివాచకం చెప్పటానికన్నా మించిన అజ్ఞానం మరొకటి లేదు. తెలిసియూ నేను ఈ అజ్ఞానంలో మునగటం చాలా పొరపాటు. జన్మించినటువంటివాడు శ్రీమన్నారాయణుడు. నీవు పుత్రవాత్సల్యముచేత మాయలో మునిగి వున్నావు' అని చెప్పి కంటిధారలు కారుస్తూ వెనక్కి వెళ్ళాడు.

అంత దైవఋషియైన వసిష్ఠుడుకూడా ఒక్కొక్క సమయంలో దైవత్వాన్ని గుర్తించుకోలేకపోయాడు. అతడికి శ్రీమన్నారాయణుడని తెలుసు. ఇంత తెలుసుకున్న వసిష్ఠులవారుకూడా రామునకు ప్రబోధలు చేస్తూవచ్చాడు. అదియే వసిష్ఠగీత. యోగవాసిష్ఠము అన్నారు. ఇంత తెలుసుకున్న వసిష్ఠునికి ఎందుకీ మాయ రావటం? సామాన్యమైన మానవత్వముగా భావించుకుంటూ తరువాత దివ్యత్వమును కూడా నిరూపించాడు. దీనికి కారణము ఉపాధియే. చిన్న ఉదాహరణము.– లోకములో అనేక ముహూర్తములు పెడుతూ వుంటారు పండితులు. శ్రీమన్నారాయణుడైన రాముని పట్టాభిషేకమునకు వసిష్ఠులవారే ముహూర్తము పెట్టారు. తెల్లవారి ఏడు గంటలకు పట్టాభిషేకమని. ఆ ముహూర్తము అరణ్యవాసమునకు ముహూర్తముగా మారిపోయింది. ఏమిటి ఈ ముహూర్తముయొక్క పవిత్రత? ఎవరు పెట్టినది? ఎవరో పంచాంగ బ్రాహ్మణుడు పెట్టినది కాదు. సాక్షాత్ వసిష్ఠులవారు పెట్టినది. బ్రహ్మర్షి. కానీ, ఈవిధింగా మార్పు వచ్చింది. అనగా దైవ సంకల్పమునకు ఏ ముహూర్తము అడ్డు రాదు. వారు పెట్టే ముహూర్తము ఒకటి, జరిగేది మరొకటి.

కౌశికుడు ఒకానొక సమయంలో వేటకై అడవికి వెళ్ళి అలసిపోయి, ఒక ఆశ్రమము చేరాడు. అది వసిష్ఠాశ్రమము. వసిష్ఠులవారికి నమస్కరించి ఆశ్రమముయొక్క సౌందర్యమును, ప్రశాంతతను గుర్తించి వసిష్ఠులవారితో కొంతవరకు సంభాషణ సల్పి ఆశ్రమముయొక్క దివ్యత్వమును వర్ణిస్తూ తిరిగి వెనుకకు వెళ్ళాలని సెలవు కోరాడు. వసిష్ఠులవారు,' ఈ రాజ్యమునకు మీరు రాజు. మీయొక్క అధికారముచేతనే మేము ఈ అరణ్యములో క్షేమంగా జీవించగలుగుతున్నాము. మీ పరిపాలన చాలా ప్రధానమైనది. సర్వ ఋషులను సంరక్షించే ఉపాయములు మీరు చేస్తున్నారు. ఇలాంటి రాజ్యములో జీవించే ఋషులుగా వుండి మీకు తగిన సత్కారము చేయకపోతే మాకు సరైన గౌరవము కాదు. ప్రభువులు మా ఆశ్రమములో ప్రవేశించారు. ఈనాడు మీరు మా ఆతిథ్యము తీసుకోవాలి' అన్నాడు. 'స్వామీ! పాలో, కొద్ది నీరో యిస్తే చాలు. కేవలము నేను ఒక్కడినే కాదు, సిపాయిలు చాలా మంది ఉన్నారు' అన్నాడు కౌశికుడు. 'రాజా! భగవదనుగ్రహము ఒకటి ఉంటే దేనికీ తక్కువ లేదు. ఎంత మంది ఉండినా నేను మీకు ఆతిథ్యాన్ని అందిస్తాను' అన్నాడు. కౌశికుడు చాలా ఆశ్చర్యపోయాడు. 'ఏమిటి, ఇంత మందికి ఆథిత్యము యిస్తానంటున్నాడే! ఏవిధముగా ఇవ్వగలడో చూడాలి' అనే అహంకారము బయలుదేరింది.

ఆ కౌశికుడు ఉండినప్పుడే వసిష్ఠుడు, ' శబళా!' అన్నాడు. శబళ వచ్చింది. ఆ గోవుతో, 'చూడు, మన ప్రభువు వచ్చాడు ఆశ్రమమునకు. వీరికి తగిన రీతిగా ఆతిథ్యము ఏర్పాట్లుచేయ'మన్నాడు. క్షణములో అన్నీ సిద్ధమైనాయి. కాధేనువు అది. కౌశికుడు సిపాయిలకు, ఏనుగులకు, గుఱ్ఱములకు అన్నింటికి ఆహారము లభిస్తూ వచ్చింది. రాజుగా వుండినప్పటికీ ఏనాడూ తాము అట్టి పదార్థములను భుజించలేదు. ఆలాంటి ఆహారము నందించిన శబళ రాజు దగ్గర వుండాలిగానీ ఋషి దగ్గర కాదు' అనే దుర్భావము అతడిలో బయలుదేరింది. తాను భుజించి, 'మహర్షీ! నాది ఒక చిన్న కోరిక' అన్నాడు. 'నీ శబళను నాకందించు' అన్నాడు. 'ఇది అసాధ్యము' అన్నాడు వసిష్ఠుడు. కానీ కౌశికుడు పట్టు విడువలేదు. క్రోధముచేత సిపాయిలతో చెప్పి, దీనిని మన పట్టణమునకు తీసుకుపొమ్మన్నాడు. వారు బలవంతముగా శబళను తీసుకుపోతున్నారు. శబళ, 'గురూజీ! నేను ఏమి పాపము చేశాను? నన్ను ఎందుకు పరులకు అందిస్తున్నావు? తెలిసి నేను ఏ పాపము చేయలేదు. ఏ దోషమూ చేయలేదు. ఎందుకు పరాధీనము చేస్తున్నావు?' అరుస్తున్నది. వసిష్ఠులవారు చెప్పారు,' రాజు తన భుజబలమును ఉపయోగపెడుతున్నాడు. ఆత్మబలమును ఉపయోగపెట్టటం లేదు. అలాంటి బలహీనమైన రాజుకు నేను ఏవిదంగా చెప్పాలి?' అని చెప్పి కట్టకడపటికి ఎంత చెప్పినా వినకపోవటంచేత ఆ గోవుకు స్వాతంత్ర్యము నందించాడు. 'కౌశికుని సైన్యమును ఎవరు ధిక్కరించగలరు? ఆ బాధ్యత నీదే' అని దానికి చెప్పాడు.

ఆవునుండి ఒక్క క్షణములో లక్షలాది సైన్యము పుట్టింది. ఆ లక్షల సైన్యము కౌశికుని సైన్యముపైబడి క్షణములో అందరినీ రూపుమాపింది. కౌశికుడు మాత్రమే మిగిలాడు. పరాభవం జరిగింది. ఇంటికి వెళ్ళాడు. అప్పటినుండి కౌశికుడు వసిష్ఠువారిపై ద్వేషము పూనుతూ వచ్చాడు. ఆ క్రోధమే అతని జీవితమునకు పెద్ద శాపముగా మారిపోయింది. అప్పటికీ వసిష్ఠులవారు శాంతముగనే ఉంటున్నారు. వసిష్ఠుడు బ్రహ్మఋషి. కౌశికునకు మరింత క్రోధము పెరుగుతూ వచ్చింది.